క్లుప్తంగా

అంకితభావంతో పనిచేస్తా

పోరుమామిళ్ల : తనకు అప్పగించిన బాధ్యతను అంకితభావంతో నిర్వహిస్తానని బద్వేల్‌కు చెందిన సునీల్ చెప్పారు. బద్వేల్ మునిసిపాలిటీ ఉపాధ్యక్షుడిగా నియమితులైన ఆయన పోరుమామిళ్లలో ఎమ్మెల్సీ డీసీ.గోవిందరెడ్డిని మంగళవారం కలిసి సత్కరించారు. విశ్వసనీయంగా పనిచేసే ప్రతి ఒక్కరికీ అధిష్టానం సముచిత స్థానం ఇచ్చి గౌరవిస్తుందని ఎమ్మెల్సీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యార్థి విభాగం ఉపాధ్యక్షుడు సాయి నారాయణరెడ్డి, శివ, శ్రీనివాసులు, సాంబశివ పాల్గొన్నారు.

స్పందించారు.. బాగు చేశారు



నక్కలదిన్నె కల్వర్టులో వ్యర్థాలు తొలగించిన తర్వాత వేగంగా వెళుతున్న సాగునీరు

చాపాడు : మండలంలోని నక్కలదిన్నె గ్రామంలోని చాపాడు కాలువ కింద ఉన్న నక్కలదిన్నెలో సాగునీరు కిందికి పారకుండా నిండిపోయిన వ్యర్థాలను తొలగించారు. కల్వర్టులో వ్యర్థాలు పేరుకుపోవడంతో కిందికి సాగునీరు వెళ్లకపోవడంపై ఈ నెల 28న సాక్షి దినపత్రికలో 'కల్వర్టు ఇలా.. సాగునీరు వెళ్లేదెలా?' కథనం వెలువడింది. ఈ కథనానికి స్పందించిన కేసీ కెనాల్ ఏఈ గురుమోహన్‌రెడ్డి 29న కల్వర్టులో ఉన్న వ్యర్థాలను తొలగింపజేశారు. దీంతో పాటు ఈ కాలువ కింద పలు చోట్ల ఉన్న కల్వర్టులను పరిశీలించి సాగునీరు కిందికి వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. సాగునీరు కాలువల్లో సక్రమంగా ప్రవహించేలా కేసీ కెనాల్ ఏఈ చర్యలు తీసుకోవడం పట్ల రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

కుక్కల నియంత్రణకు కృషి

బద్వేలు అర్బన్ : పట్టణంలో విచ్చలవిడిగా సంచరిస్తున్న వీధి కుక్కల నియంత్రణకు మున్సిపల్ అధికారులు కృషి చేయాలని డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు ఎం.చిన్ని పేర్కొన్నారు. ఆర్టీసీ బస్టాండు సమీపంలో ఈ మేరకు మంగళవారం ఆందోళన నిర్వహించారు. వైఎస్సార్ సీపీ 13వ వార్డు కౌన్సిలర్ షేక్‌మహమ్మద్ హసాన్ సంఘీభావం తెలిపి ఆందోళనలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ నాయకులు మస్తాన్‌షరీఫ్, ఆదిల్, ఓబుల్‌రెడ్డి, యువరాజ్, షరీఫ్, రాజు, కరీముల్లా, నాయబ్ రసూల్ పాల్గొన్నారు.

సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి

మైదుకూరు : బ్యాంకుల్లో సీసీ కెమెరాలను, అలారం సిస్టంను ఏర్పాటు చేసుకోవాలని మైదుకూరు డీఎస్పీ రాజేంద్రనాథ్ బ్యాంక్ అధికారులకు సూచించారు. మంగళవారం మైదుకూరు పట్టణం, మండల పరిధిలోని బ్యాంకుల అధికారులతో స్థానిక పోలీస్ సబ్ డివిజనల్ కార్యాలయంలో డీఎస్పీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకుల్లో దుండగులు ప్రవేశించి దోపిడీకి పాల్పడటం, ఖాతాదారుల సొమ్మును కాజేయడం వంటి సంఘటనలు జరుగుతుంటాయన్నారు. అలారం సిస్టంలను ఏర్పాటు చేసుకుని అవి ఎల్లవేళలా పనిచేసే విధంగా చూడాలని సూచించారు. సమావేశంలో అర్బన్ సీఐ కె.రమణారెడ్డి పాల్గొన్నారు.

డ్రోన్ వినియోగంపై అవగాహన

గోపవరం : మండలంలోని శ్రీనివాసపురంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ రైతులతో జరిగిన సమావేశంలో బద్వేల్ ఏడీఏ వెంకటసుబ్బయ్య, జేడీ కార్యాలయ అధికారి లక్ష్మణ్ మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ, పీఎంకిసాన్ పథకాలు అర్హులైన రైతులకు వర్తించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం డ్రోన్ వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. సజ్జ, కూరగాయల పంటలను పరిశీలించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో ఏఓ విజయరావు, ఓబయ్య, విజయకుమార్, విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

పంటను ఈ–క్రాప్ చేయించుకోవాలి

కాశినాయన : కంది, జొన్న, పెసర, మినుము పంటలు సాగు చేసిన రైతులు ఈ నెల 31వ తేదీలోగా ఈ–క్రాప్ చేయించు కోవాలని వ్యవసాయాధికారి చంద్రమోహన్, ఏఈఓ రవి తెలిపారు. మండలంలోని రంపాడు, ఉప్పలూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఈ క్రాప్ సర్టిఫికెట్ తీసుకుని వీఏఏల వద్ద బీమా చేయించుకోవాలని సూచించారు.

లూజు విత్తనాలను కొనుగోలు చేయకండి

మైదుకూరు : రైతులు వ్యాపారుల వద్ద లూజు విత్తనాలను కొనుగోలు చేయవద్దని మండల వ్యవసాయాధికారి బాలగంగాధర్ రెడ్డి అన్నారు. మండలంలోని జాండ్లవరం, తువ్వపల్లె గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి మాట్లాడుతూ లూజు విత్తనాలను కొనుగోలు చేయడం వల్ల అవి మొలకెత్తని పరిస్థితుల్లో వ్యాపారులపై ఎలాంటి చర్యలు తీసుకోలేమన్నారు.రైతులకు 50 శాతం సబ్సిడీతో జింక్ సల్ఫేట్, జిప్సంలను అందిస్తున్నట్టు తెలిపారు.

ఉపాధిలో అక్రమాలు అనేకం



ఉపాధి హామీ పనుల్లో అక్రమాలపై ఫిర్యాదు చేస్తున్న ఎంపీటీసీ చంద్రభాస్కర్‌రెడ్డి



హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు

- ఫిర్యాదు చేసిన చర్యలు తీసుకోకపోవడంపై సభ్యుల మండిపాటు
- సమావేశంలో అధికారుల తీరును ప్రశ్నించిన ఎంపీటీసీ చంద్రారెడ్డి

ఖాజీపేట : ఉపాధి హామీ పథకంలో అక్రమాలు జరుగుతున్న ఎలాంటి చర్యలు లేవు.. ఎప్పుడు చర్యలు తీసుకుంటారని ఎంపీటీసీ చంద్రభాస్కర్ రెడ్డి అధికారులను నిలదీశారు. ఖాజీపేట మండల సర్వసభ్య సమావేశం ఎంపీడీఓ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీచువారిపల్లె పరిధిలో 86 జాబ్ కార్డులు అక్రమంగా ఉన్నాయన్నారు. ఉపాధి పనికి వెళ్లకపోయినా వెళ్లినట్లు నమోదు చేసుకుని ఉపాధి సొమ్ము స్వాహా చేస్తున్నారు. నిజమైన వారికి తీరని అన్యాయం చేస్తున్నారని పేర్కొన్నారు. అలాగే ఖాజీపేటలో ఉన్న వారు పనిచేస్తే నందిపాడు గ్రామంలోని వారు పనిచేస్తున్నట్లు ఫొటోలు ఇస్తున్నారని చెప్పారు. అందుకు తగ్గ ఆధారాలను ఎంపీడీఓకు అందించారు. కడపలో ప్రైవేటు ఉద్యోగం చేసుకునే వారు ఉపాధిలో పనిచేసినట్లు చూపించి ఫీల్డ్ అసిస్టెంట్స్, మేట్లు డబ్బు స్వాహా చేస్తున్నారన్నారు. దీనిపై స్పందించిన ఎంపీడీఓ దివిజా సంపతి వారంలోగా వ్యక్తిగతంగా విచారణ జరిపి అక్రమాలకు పాల్పడ్డ వారిపై చర్యలు తీసుకుంటానని సభాముఖంగా హామీ ఇచ్చారు.

అధిక ధరకు విత్తన వడ్లు అమ్మకాలు

ఖాజీపేట టౌన్‌లో విత్తన వడ్లు అధిక ధరకు అమ్ముతున్నట్లు అగ్రహారం సొసైటీ అధ్యక్షుడు హరినాథ రెడ్డి సభాదృష్టికి తీసుకు వచ్చారు. ఖాజీపేటలోని డీలర్లు అందరూ సిండికేట్ అయ్యి ఇష్టానుసారంగా అమ్ముతున్నారని ఆరోపించారు. యూరియా బస్తా రూ.350కి పైగానే ధరలు అమ్ముతున్నారని తెలియజేశారు. స్పందించిన ఏఓ నాగార్జున అధిక ధరకు ఎవ్వరైనా అమ్మితే కఠిన చర్యలు ఉంటాయని రైతులు రాత పూర్వకంగా ఫిర్యాదు చేయాలని సూచించారు. కేసీ కెనాల్ పరిధిలో తొలిసారిగా జూలై 14న నీటిని విడుదల చేయడం జరిగిందని కేసీ కెనాల్ ఏఈ గురుమోహన్ అన్నారు. రావులపల్లె చెరువు కరకట్ట వద్ద ఏర్పాటు చేసిన పైప్‌లైన్‌ను ధ్వంసం చేశారని. కరకట్ట నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని సభను కోరారు. అనంతరం హార్టికల్చర్ పంటల సాగు పట్ల ప్రభుత్వం అనేక సదుపాయాలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు కనపర్తి సుబ్బారెడ్డి, బండి శ్రీనివాసులు, మండల ఉపాధ్యక్షురాలు ప్రశాంతి, కరీమున్నీసా, చంద్రభాస్కర్ రెడ్డి, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న లీడ్ బ్యాంక్ మేనేజర్ జనార్దన్

చాపాడు : ప్రస్తుత కాలంలో పెరుగుతున్నసైబర్ మోసాల పట్ల బ్యాంకు ఖాతాదారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా లీడ్ యూనియన్ బ్యాంకు మేనేజర్ జనార్దన్ పేర్కొన్నారు. మండలంలోని ఖాదర్‌పల్లెలో చాపాడు యూనియన్ బ్యాంక్ మేనేజర్ కేవీ రమణ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ పథకాలు, ఆర్థిక అక్షరాస్యతపై మంగళవారం సాయంత్రం గ్రామ పంచాయతీ సాచురేషన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా లీడ్ బ్యాంకు మేనేజర్ మాట్లాడుతూ ప్రస్తుతం సైబర్ మోసాలు పెరిగిపోయాయన్నారు. 50 ఏళ్లు పైబడిన వారిని టార్గెట్‌గా చేసుకుని 40–45 రకాల మోసాలకు పాల్పడుతున్నారన్నారు. ఎటువంటి ఏపీకే యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవద్దని తెలియజేశారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న బీమా పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. యూనియన్ బ్యాంకు డిప్యూటీ రీజనల్ హెడ్ రంజిత్ కుమార్ మాట్లాడుతూ ప్రధాన మంత్రి బీమా యోజనా కింద రూ.20లు చెల్లిస్తే రూ.2లక్షల ప్రమాద బీమా పొందవచ్చని, జీవన జ్యోతి పథకం ద్వారా రూ.436లు చెల్లిస్తే జీవిత ప్రమాద బీమా రూ.2లక్షలు పొందవచ్చన్నారు. ప్రతి రైతు ప్రధాన మంత్రి ఫసల్ బీమాను చేయించుకోవాలని సూచించారు. అనంతరం యూనియన్ బ్యాంకు అందిస్తున్న సేవలపై బ్యాంకు మేనేజర్ కేవీ రమణ మహిళలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది జయశేఖర్, యానిమేటర్లు జమీలా, సాంబ, సుబ్బయ్య, ఓబుళరాజు, శరత్ బాబు తదితరులు పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరి

చాపాడు : వరి సాగు చేసుకునే రైతులు తప్పనిసరిగా ఈ–క్రాప్ నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి దేవి పద్మలత పేర్కొన్నారు. మండలంలోని ఎన్.ఓబాయపల్లె, అయ్యవారిపల్లె గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ వరి సాగుకు ముందు నారు మళ్లు వేసుకునే రైతులు విత్తన శుద్ధి చేసుకోవాలని, దీని వలన వరి నాట్లు వేసే క్రమంలో పంటకు ఉపయుక్తంగా ఉంటుందన్నారు. పీఎం కిసాన్, అన్నదాన సుఖీభవ, పంటల బీమా, మినీకిట్లు, సూక్ష్మ పోషకాల పంపిణీపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కడప కృషి విజ్ఞాన కేంద్రం, వ్యవసాయాధికారి శాస్త్రవేత్త పద్మజ అయ్యవారిపల్లె గ్రామంలో నారుమడులను పరిశీలించి సీడింగ్ బ్లైట్‌ను గుర్తించి దాని నివారణ కోసం కార్బెండాజిమ్ 0.5 గ్రాముల మందును లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ స్వప్న, వీఏఏ అంజలి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రానికి 1200 మంది ఓటర్లు ఉండేలా చర్యలు



మాట్లాడుతున్న ఆర్డీఓ చంద్రమోహన్

బద్వేలు అర్బన్ : కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఒక్కో పోలింగ్ కేంద్రంలో 1200 మంది ఓటర్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ ఎ.చంద్రమోహన్ అన్నారు. ఆర్డీఓ కార్యాలయంలోని సభా భవనంలో రాజకీయ పార్టీల నేతలు, నియోజకవర్గంలోని తహసీల్దార్లు, ఎన్నికల విభాగం డీటీలతో మంగళవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓటర్లు అధికంగా ఉన్న పోలింగ్ కేంద్రాలను గుర్తించాలని, ప్రతి ఒక్కరూ ఓటుహక్కు వినియోగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అదనపు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసేటపుడు వివాదాలకు తావు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘాలు జారీ చేసిన మార్గదర్శకాలను అనుసరించి అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అభ్యంతరాలు ఉంటే ఆయా రాజకీయా పార్టీల నేతలు రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలని కోరారు. సమావేశంలో ఆయా మండలాల తహసీల్దార్లు, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్లు పాల్గొన్నారు.

లెదర్ పరిశ్రమ ఏర్పాటుకు కృషి

బద్వేలు అర్బన్ : మున్సిపాలిటీ పరిధిలోని చెన్నంపల్లె రెవెన్యూ పొలం సర్వే నెంబర్ 1580/బిలో చర్మకారుల సొసైటీకి కేటాయించిన 3.64 ఎకరాల స్థలంలో ప్రభుత్వం ద్వారా నిధులు కేటాయించి లెదర్ పరిశ్రమ ఏర్పాటుకు కృషి చేస్తామని లెదర్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ జి.మల్లేష్ పేర్కొన్నారు. స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయ సభా భవనంలో లిడ్‌క్యాప్ మాజీ డైరెక్టర్ రాజశేఖర్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లిడ్‌క్యాప్, డీఆర్‌డీఏ సంయుక్త ఆధ్వర్యంలో చర్మకారుల కోసం మంజూరు చేసిన 3.64 ఎకరాల స్థలాన్ని కబ్జాకు గురికాకుండా ప్రహరీ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో లిడ్ క్యాప్ మాజీ డైరెక్టర్ గొడుగునూరురాజశేఖర్, సీనియర్ దళిత నాయకులు ఎస్.పిచ్చయ్య, బి.కేశవయ్య, దళితవేదిక జిల్లా అధ్యక్షుడు ఓబయ్య, నాయకులు బాలయ్య, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పాడి పరిశ్రమ ప్రోత్సాహానికి చర్యలు



మాట్లాడుతున్న ప్రభుత్వ పశువైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసప్రసాద్

ప్రొద్దుటూరు : గ్రామాల్లో పాడి పరిశ్రమను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అవసరమైన చర్యలను తీసుకుంటోందని స్థానిక ప్రభుత్వ పశువైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసప్రసాద్ తెలిపారు. కళాశాలలో మంగళవారం 42వ ఇండియన్ సొసైటీ ఆఫ్ అనిమల్ ప్రొడక్షన్ అండ్ మేనేజ్‌మెంట్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పశువైద్య విద్యార్థులు శాస్త్రీయ పరిశోధనలు చేయాలని తెలిపారు. రైతుల పాడి పరిశ్రమ అభివృద్ధికి తోడ్పడాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అధ్యాపకులు డాక్టర్ ఇందిరా, డాక్టర్ జీవన, పీజీ విద్యార్థులు డాక్టర్ జాన్ సుధాకర్, డాక్టర్ వంశీ విద్యార్థులకు లైవ్ స్టాక్ రంగంలో తాజా సాంకేతికత, శాస్త్రీయ అభివృద్ధులపై అవగాహన కల్పించారు.

డెంగ్యూను పారదోలుదాం

ప్రొద్దుటూరు క్రైం : డెంగ్యూ వ్యాధిని పారదోలడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా మలేరియా అధికారిణి డాక్టర్ మునీరమ్మ తెలిపారు. జాతీయ డెంగ్యూ నివారణ మాసోత్సవాలు సందర్భంగా మంగళవారం శ్రీనివాసనగర్ అర్బన్ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మలేరియా అధికారి మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. నిల్వ నీటిలో దోమలు వృద్ధి చెందుతాయని తద్వారా డెంగ్యూ, మలేరియాతో పాటు ఇతర సీజనల్ జ్వరాలు వ్యాపిస్తాయని చెప్పారు. ఈ దోమలు ఎక్కువగా పగటి పూట కుడుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్‌యూనిట్ అధికారి శ్రీనివాసులు, సీఓ నాగజ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టళ్ల సమస్యలను పరిష్కరించాలి



విద్యార్థుల సమస్యలను తెలుసుకుంటున్న వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నాయకులు

ప్రొద్దుటూరు : ప్రభుత్వం సంక్షేమ హాస్టళ్ల సమస్యలను పరిష్కరించాలని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు సీఎం దావూద్ తెలిపారు. సోమవారం రాత్రి వైఎస్సార్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో స్థానిక బీసీ, ఎస్టీ సంక్షేమ హాస్టళ్లను సందర్శించారు. విద్యార్థులతో సమావేశమై వారు ఎదుర్కొంటున్న సమస్యలను దావూద్ అడిగి తెలుసుకున్నారు. అరకొర వసతులతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. దోమల బెడదతో విద్యార్థులు నిద్రపోలేకపోతున్నారని తెలిపారు. ప్రభుత్వం హాస్టళ్లకు నిధులు కేటాయించి వసతులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శి రుద్రసేనా రెడ్డి, కార్యదర్శి చైతన్య తదితరులు పాల్గొన్నారు.

క్షయ నిర్మూలనకు కృషి చేద్దాం

బద్వేలు అర్బన్: క్షయ వ్యాధి నిర్మూలనకు వైద్య సిబ్బంది అంకిత భావంతో పనిచేయాలని జిల్లా అదనపు వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్.రవిబాబు అన్నారు. టి.బి.ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో క్షయవ్యాధి పర్యవేక్షణ సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు.

వైఎస్ జగన్‌ను కలిసిన జిల్లా నేతలు



మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని జ్ఞాపికతో సత్కరిస్తున్న రెడ్యం వెంకట సుబ్బారెడ్డి





వైఎస్ జగన్‌తో కె. నాగేంద్రారెడ్డి , గురుమోహన్

కడప కార్పొరేషన్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శులు రెడ్యం వెంకట సుబ్బారెడ్డి, ఎస్. గురుమోహన్, కె. నాగేంద్రారెడ్డి కలిశారు. మంగళవారం విజయవాడ తాడేపల్లిలోని కేంద్ర కార్యాలయంలో వారు ఆయనను వేర్వేరుగా కలిసి తమను రాష్ట్ర కార్యదర్శులుగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. రెడ్యం వెంకట సుబ్బారెడ్డి తన సోదరుడు చంద్రశేఖర్‌రెడ్డి, కుమారుడు వెంకట సాయి ప్రత్యూష్, సోదరుడి కుమారుడు ధీరజ్‌రెడ్డి తదితరులతో వైఎస్ జగన్‌ను కలిసి శాలువా కప్పి, జ్ఞాపిక అందజేసి ఘనంగా సత్కరించారు.

వరిలో యాజమాన్య పద్ధతులు పాటించండి

దువ్వూరు : వరి పంటలో రైతులు సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించడం వలన అధిక దిగుబడులు పొందవచ్చని మండల వ్యవసాయ అధికారి అమరనాథ్ రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని గోపులాపురం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో సాగయ్యే వరి పంటకు సమగ్ర యాజమాన్య పద్ధతులను పాటించాలని, వరి పైరుకు ముందు పచ్చిరొట్ట ఎరువులను వేసుకుని పొలంలో కలియదున్నడం వల్ల 25 శాతం ఎరువుల వినియోగాన్ని తగ్గించుకోవచ్చన్నారు.

మేకవారిపల్లెలో..

బి.కోడూరు : మండలంలోని మేకవారిపల్లె, ఆనం వారిపల్లె గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏడీఏ మురళీధర్ రెడ్డి వరిపంట పొలాలను పరిశీలించి కొనలు తుంచి నాటుకోవడం వలన కాండం తొలుచు పురుగు గుడ్లను నాశనం చేయవచ్చని రైతులకు తెలిపారు. యూరియాను సిఫార్సు మేరకు వాడాలని, అధిక మోతాదులో వాడకూడదన్నారు. యూరియా అందుబాటులో ఉందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.ఏఓ కౌశిక, వీఏఏ బ్రహ్మానందరెడ్డి, షణ్ముఖ్‌శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

టేకూరుపేటలో..

పోరుమామిళ్ల : టేకూరుపేట రైతు సేవాకేంద్రంలో మంగళవారం సర్పంచ్ రమణారెడ్డి అధ్యక్షతన పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పీయం కిసాన్, అన్నదాత సుఖీభవ, చిరుసంచులు, సాగులో ఉన్న పంటల్లో సస్యరక్షణ చర్యలు తదితర అంశాలపై వ్యవసాయ సహాయకులు పద్మావతి వివరించారు. అనంతరం యూరియాను రైతులకు పంపిణీ చేశారు.

కమలకూరులో..

అట్లూరు : మండలంలోని కమలకూరు, నల్లాయపల్లె గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. బద్వేలు ఏడీఏ వెంకటసుబ్బయ్య, జేడీఏ కార్యాలయ అధికారి లక్ష్మణ్ రైతులతో గ్రామసభ నిర్వహించి ప్రకృతి వ్యవసాయ పద్ధతులను వివరించారు. అనంతరం రాగి పొలాన్ని రైతులతో కలిసి పరిశీలించారు.

హామీలిచ్చారు.. నెరవేర్చేదెప్పుడో?



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అట్లూరు : కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఎప్పుడు అమలు చేస్తారో చెప్పాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ముడమాల ప్రభాకర్‌రెడ్డి, ఏపీ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ముడమాల బాలమునిరెడ్డి కోరారు. మండలంలోని మాడపూరు, కోనరాజుపల్లె, చిన్నరాజుపల్లె, బీసీ కాలనీ, ఎస్సీ కాలనీలలో బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీపై ఇంటింటా అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ ప్రజలను మభ్యపెట్టి ఓట్లు దండుకోవాలనే ఉద్దేశ్యంతో ఎన్నో హామీలిచ్చి అధికారం దక్కించుకుని ఏడాదిన్నరవుతున్నా లబ్ధిదారులకు అందించిన దాఖలాలు లేవని తెలిపారు. హామీలు నెరవేర్చిన ముఖ్యమంత్రిగా వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోయారని, ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నవోలు బ్రహ్మానందరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు రాజవోలు సుబ్బారెడ్డి, సర్పంచ్ రాములమ్మ, ఈశ్వర్‌రెడ్డి, కె.గంగిరెడ్డి, సగిలి శ్రీనివాసులరెడ్డి, కొండుసుబ్బారెడ్డి, పోలిరెడ్డి నాగిరెడ్డి, వెంకట సుబ్బారెడ్డి, సోదినపల్లి వెంకటసుబ్బారెడ్డి, రొండా రాజగోపాల్‌రెడ్డి, బయ్యపురెడ్డి, లక్ష్మిరెడ్డి, జగన్‌రెడ్డి, నాగయ్య, మల్లికార్జున్, మాల్యాద్రి, ఎం.సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులపై లాఠీఛార్జి అమానుషం



ఆందోళన నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులు

బద్వేలు అర్బన్ : నగర పాలక సంస్థ పరిధిలోని మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని చేస్తున్న శాంతియుత ర్యాలీని అడ్డుకుని వారిపై లాఠీఛార్జి చేసి అరెస్టు చేయడం దారుణమని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) కోశాధికారి కె.శివకుమార్ అన్నారు. లాఠీఛార్జి, అరెస్టులను నిరసిస్తూ మంగళవారం పాత మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల ఉపాధికి ఎసరు తెచ్చే విధంగా నెల్లూరు నగరంలో ప్రారంభించిన వర్క్ ఔట్‌సోర్సింగ్ విధానాన్ని ఆపాలన్నారు. గత 17 రోజులుగా మున్సిపల్ కార్మికులు శాంతియుతంగా పోరాడుతుంటే అక్కడి పోలీసులు నిర్దాక్షిణ్యంగా లాఠీఛార్జి చేయడం దారుణమన్నారు. మహిళా కార్మికులను సైతం చెప్పుకోలేని ప్రాంతాల్లో లాఠీలు, బూటుకాళ్లతో దాడి చేయడం సరికాదన్నారు. మాది మంచి ప్రభుత్వమని చెప్పుకుంటున్న ముఖ్యమంత్రి, డిప్యూటీ ముఖ్యమంత్రి పాలనలో దళిత, గిరిజన వర్గాలకు చెందిన కార్మికులపై దాడికి తెగపడడ సిగ్గుచేటన్నారు. దాడికి పాల్పడిన సీఐ శ్రీనివాసరావు, ఇతర పోలీసులపై చట్టపరమైన చర్యలు తీసుకోకపోతే ఉద్యమానికి శ్రీకారం చుడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హరి, శ్రీనివాసులు, దేవమ్మ, సత్యరాజు, కిరణ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జీవవైవిధ్యం కాపాడటంలో పులులదే కీలక పాత్ర



మాట్లాడుతున్న ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ హేమాంజలి

ప్రొద్దుటూరు క్రైం : జీవవైవిధ్యం కాపాడటంలో పులులు కీలక పాత్ర వహిస్తున్నాయని ప్రొద్దుటూరు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ హేమాంజలి తెలిపారు. వాటికి తెలియకుండానే అవి అడవిని రక్షిస్తుంటాయన్నారు. పట్టణంలోని గీతాశ్రమం ప్రాంగణంలో ఉన్న శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కాలేజీలో మంగళవారం టైగర్స్‌డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఎఫ్‌ఆర్‌ఓ మాట్లాడుతూ రాను రాను అడవులు ధ్వంసం అవుతుండటం వల్ల పులుల సంఖ్య తగ్గిపోతోందని తెలిపారు. క్రమంగా పులులు అంతరించిపోయే ప్రమాదముందని గుర్తించిన ప్రపంచ దేశాలు ఏటా జూలై 29న అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని జరుపుకుంటున్నట్లు పేర్కొన్నారు. పులులు మనుగడ సాగించేందుకు అటవీశాఖ అనుకూల వాతావరణం కల్పించేందుకు, వాటి సంరక్షణకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కళాశాల కరస్పాండెంట్ హరినారాయణ, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ లక్ష్మీకుమారి, సంస్కృతి స్వచ్ఛంద సేవాసంస్థ కార్యదర్శి శ్రీనివాసులరెడ్డి, ఎన్టీఆర్ విశ్వవిద్యాలయ ఈసీ మెంబర్ డాక్టర్ వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీ వైద్యులపై వేధింపులు మానండి



నివాళులర్పిస్తున్న ఆర్‌ఎంపీ వైద్యులు

పోరుమామిళ్ల : జిల్లా వ్యాప్తంగా ఆర్‌ఎంపీ వైద్యులు వివిధ కారణాలతో ఇబ్బందులు పడుతున్నారని ఆర్‌ఎంపీ డాక్టర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు పాపన్న, క్రమశిక్షణ కమిటీ చైర్మన్ నారాయణ, ప్రొద్దుటూరు అధ్యక్షుడు బాలాజీ అన్నారు. ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన సుబ్బరాయుడుకు నివాళి అర్పించేందుకు పోరుమామిళ్ల ఆర్‌ఎంపీ వైద్యులు మంగళవారం సమావేశమయ్యారు. ముందుగా సుబ్బరాయుడు చిత్రపటానికి నివాళి అర్పించారు. అనంతరం పాపన్న, నారాయణ, బాలాజీలు మాట్లాడుతూ ఆర్‌ఎంపీ వైద్యుల వద్దకు పేదలే వస్తారన్నారు. ఆస్పత్రిలో రక్త పరీక్ష పరికరాలు పెట్టుకుంటే కొందరు కక్ష సాధింపు ధోరణితో ఇబ్బంది కలిగిస్తున్నారన్నారు. అనంతరం మండల ఆర్‌ఎంపీల నూతన కమిటీ అధ్యక్షుడిగా చెన్నకేశవులు, ఉపాధ్యక్షుడిగా బాలయ్య, ట్రెజరర్‌గా గురుప్రసాద్, సభ్యులుగా కంబయ్య, శివారెడ్డి, సుధాకర్, దుర్గా భవాని, రమేష్, నజీర్‌బాషా, నాయబ్, చెన్నయసోని, హుసేన్‌బేగ్, గురుప్రతాప్‌లను ఎన్నుకున్నారు.

మృతుడి కుటుంబీకులకు బీమా సాయం



చెక్ అందజేస్తున్న అధికారులు

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల ఫారెస్ట్ రేంజ్‌లో ఏబీఓగా పనిచేస్తూ జూన్ 8న గుండెపోటుతో మృతి చెందిన రామాంజనేయులు కుటుంబానికి సంజీవని పథకం కింద రూ.5 లక్షల బీమా మొత్తాన్ని పీసీసీఎఫ్ నాయక్, అడిషనల్ పీసీసీఎఫ్ శాంతిప్రియ మంగళవారం అందజేశారు. డిప్యూటీ సీఎఫ్ రామచంద్రరావు మాట్లాడుతూ మృతుడు రామాంజనేయులు కుటుంబానికి ఆ డబ్బు ఎంతో ఉపయోగపడుతుందని, బ్యాంకు నుంచి రావాల్సిన బెనిఫిట్స్ అందేలా చూస్తామన్నారు.

అభినందన



పతకాలు సాధించిన చిన్నారులను అభినందిస్తున్న డీఎస్పీ భావన

ప్రొద్దుటూరు క్రైం : జాతీయ స్థాయిలో తైక్వాండో చాంపియన్‌షిప్‌లో ప్రతిభ కనబరచిన చిన్నారులను ప్రొద్దుటూరు డీఎస్పీ భావన అభినందించారు. మై స్పేస్ తైక్వాండో అకాడమి క్రీడాకారులు జాతీయ స్థాయి ఓపెన్ తైక్వాండో చాంపియన్‌షిప్‌లో పతకాలు సాధించారు. తైక్వాండో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (టిఎఫ్‌ఐ) ఆధ్వర్యంలో 10వ జాతీయ స్థాయి ఓపెన్ తైక్వాండో పోటీలు ఈ నెల 25 నుంచి 27 వరకు విజయవాడలోని చెన్నుపాటి రామకోటయ్య మున్సిపల్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించారు. ఈ పోటీల్లో మై స్పేస్ తైక్వాండో అకాడమి క్రీడాకారులు సమురుల్ హుడా, ఖాన్సా రుహుల్లా, అబ్దుల్ పాహద్, సాయితేజ్, ఆరాధ్యలు బంగారు పతకాలు గెలుపొందగా ఖీజర్, జహిదాబాను, అఫ్రోజ్, రకీబ్ అనాస్ అబ్దుల్లా, ఇర్ఫాన్‌లు రజిత పతకాలు, అల్యోంక, అబ్దుల్లాలు కాంస్య పతకాలు సాధించారు. వీరిని మంగళవారం తన కార్యాలయంలో డీఎస్పీ భావన అభినందించారు. కార్యక్రమంలో అకాడమి డైరెక్టర్ మాస్టర్ సలీం, చీఫ్ కోచ్ మహబూబ్‌బాషాలు పాల్గొన్నారు.

తెలుగు సాహిత్యంలో చిరస్మరణీయుడు సినారే



డాక్టర్ సి.నారాయణరెడ్డి చిత్రపటానికి పూలమాల వేస్తున్న జింకా సుబ్రహ్మణ్యం

ప్రొద్దుటూరు కల్చరల్ : తెలుగు కవితకు కొత్త పరిమళాలను అందించిన అద్వితీయ అభ్యుదయ కవి జ్ఞానపీఠ అవార్డు గ్రహీత డాక్టర్ సి.నారాయణ రెడ్డి అని జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి జింకా సుబ్రహ్మణ్యం తెలిపారు. స్థానిక నందిని క్లాత్ మార్కెట్‌లో జనవిజ్ఞాన వేదిక కార్యాలయంలో డాక్టర్ సి.నారాయణరెడ్డి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. సమావేశంలో జేవీవీ రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, రిటైర్డు విద్యాధికారి గడియారం వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.